RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 193

శుక్రవారం
జూన్ 27, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



**ఎస్సీఓ భేటీలో భారత్ సంచలనం**

3లో..






# డ్రగ్స్ పై ఈగల్ నిఘా

- నిరంతర శ్రమతోనే విజయం
- డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శం
- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ అంటే ఐటీ, ఫార్మా రంగాలకు ప్రాచుర్యం పొందిందని, ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్ హబ్‌గా మారొద్దని అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ అంటే ఉద్యమాలు, పోరాటాల గడ్డ అని, ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమానకరమని సీఎం అన్నారు. నిరంతరశ్రమ, కఠోరదీక్షతోనే ఏ రంగంలోనైనా విజయం సాధించగలమని తెలిపారు. పాఠశాలలు మొదలు యూనివర్సిటీల వరకు డ్రగ్స్ ప్రభావం పడిందని, 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణపతకం రాకపోవటం గురించి ఆలోచించాలని సీఎం తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదమని, ఒక దేశాన్ని దెబ్బతీయడానికి శత్రుదేశాలు ఏ మార్గాన్ని ఎంచుకుంటాయో చెప్పలేమని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని దేశాలు కొవిడ్‌ను ఎంచుకోవచ్చు, కొన్ని దేశాలు డ్రగ్స్‌ను ఎంచుకోవచ్చని, యుద్ధం,

మిగతా 4వ పేజీలో..



## ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల దోపిడీ అరికట్టాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు పాఠశాలలలో ఫీజుల దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముట్టడించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ మాట్లాడుతూ మిర్యాలగూడలో ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీ అరికట్టడంలో విద్యాశాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వలన పేద విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పాఠశాలల విద్యార్థులే లక్ష్యంగా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుండి స్కూల్ ఫీజు లే కాక బుక్స్,యూనిఫామ్స్,టై ,బెల్ట్ ల పేరిట లక్షల రూపాయల్లో ఫీజులు దండుకుంటున్నారు. కొన్ని ప్రైవేటు బుక్ స్టాల్ లని అడ్డాగా చేసుకొని పుస్తకాల పేరిట వ్యాపారం కొనసాగిస్తున్న కూడా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో ఫీజుల పట్టిక నిర్వహించాలి అలాగే గవర్నింగ్ బాడీ లేకుండా ఫీజులు పెంచే అధికారం

మిగతా 4వ పేజీలో..

## డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత




**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

విద్యార్థులు,యువత డ్రగ్స్ నిర్మూలనలో బాధ్యత వహించాలని తమ జీవితాలను, సమాజాన్ని డ్రగ్స్ బారిన పడకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కాపాడుకోవాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక కే ఎన్ ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడలో అబ్కారీ శాఖ,కళాశాల ఎన్ఎస్ఎస్,ఎన్ సి సి,యాంటి డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎమ్. శివకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ప్రివెన్షన్ ఈస్ బెటర్ దెన్ క్యూర్ అంటూ అందరూ డ్రగ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఇన్చార్జి ప్రిన్సిపల్ శివకృష్ణ పేర్కొన్నారు. ఎస్ఐ రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ అమ్మడం కానీ కొనడం గమనిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి. నరేష్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ పి నాగరాజు,ఎస్ఐ లావణ్య,ఎస్ఐ పర్వీన్,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తో పాటు ఎన్ సి సి మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

### -మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

యువత భవిష్యత్తు బాగుండాలంటే మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ యంత్రాంగం, సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవంలో భాగంగా ఎన్ జి కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ఎన్ జి కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ క్లాక్ టవర్ చేరుకున్న అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కరోనా తర్వాత డ్రగ్స్ వాడకం పెరిగిందని చెప్పారు. విద్యార్థులు డ్రగ్స్ కు బానిసలుగా మారుతున్నారని, తెలంగాణలో డ్రగ్స్ అన్నదే ఉండరాదని, విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ కట్టిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా నల్గొండలో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నామన్నారు. త్వరలోనే సిఎంతో దీనిని ప్రారంభిస్తామని, డ్రగ్స్ వాడే వారిని తరిమి కొట్టాలని, విద్యా ర్థులకు లైఫ్ టర్నింగ్ టైం అని,20 ఏండ్ల వరకు చదువు, స్పోర్ట్స్,యోగ పై దృష్టిపెట్టాలని కోరారు. విద్యార్థులు, యువత సెల్ ఫోన్ కు దూరంగా ఉం డాలని, అవసరమైతేనే వాడాలని, చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. చదివి పోటీ పరీ క్షలు రాస్తూ ఉద్యోగాలు పొందా లని అన్నారు. ప్రకాశం బజార్ లో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల నిర్మిస్తున్నామని,డిజిటల్ తరగతుల తో పాటు, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్ బాగు ండాలంటే డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, విద్యార్థులకు ఎం కావాలన్న ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ,మంత్రిగా సహకారం అంది స్తామన్నారు. డ్రగ్స్ కువ్యతిరేకంగా

మిగతా 4వ పేజీలో..

## మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



4లో..



## రైతు సంక్షేమమే సీఎం సంకల్పం


- సన్న బియ్యం దేశంలో మరెక్కడా లేదు
- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

మిగతా 4వ పేజీలో..

కాళేశ్వరం ప్రాజెక్టు కులేశ్వరంగా మారిందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పదేళ్ల కాలంలో వేల కోట్ల

## నిద్రమత్తులో కంప్యూటర్ ఆపరేటర్లు..!



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లాలో తహసిల్దార్ కార్యాలయాల్లో ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుల దృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో రెవిన్యూ

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

శుక్రవారం, జూన్ 27, 2025

# జాగ్రత్తలు పాటించాల్సిందే

**- నేషనల్ డయాబెటిస్ డే సందర్భంగా డాక్టర్ సురేశ్ పలు సూచనలు- ప్రతిరోజూ మూడు సార్లు సమతుల్య ఆహారం తీసుకోవాలి**

**వేద న్యూస్, జమ్మికుంట:**

మారుతున్న జీవనశైలి వల్ల మానవాళి రకరకాల సమస్యలను కొని తెచ్చుకుంటోంది. కాగా, ఆరోగ్యకరమై లైఫ్ స్టయిల్ కంపల్సరీగా ప్రతి ఒక్కరూ ఫాలో కావాలని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. ప్రతి రోజూ సమయానికి ఆహారం తీసుకుంటే.. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని వెల్లడిస్తున్నారు. ఫుడ్ నేయడం, టైమ్‌కు తినకపోయినా.. రక్తంలో చక్కెర స్థాయిలలో హెచ్చుతగ్గులకు కారణమవుతాయి. మీ రక్తంలో చక్కెర స్థాయిని స్థిరంగా ఉంచడానికి, ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు.. రోజుకు మూడు సార్లు సమతుల్య ఆహారం తీసుకోవాలని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. నేషనల్ డయాబెటిస్ డే సందర్భంగా మధుమేహం బారిన పడిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జమ్మికుంట సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు, ఐఎంఏ హుజూరాబాద్ జమ్మికుంట శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఊడుగుల సురేశ్ వివరించారు. డయాబెటిస్ బారిన పడినవారు కచ్చితంగా వారి జీవితకాలమంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. షుగర్ పేషెంట్స్.. ఫైబర్ రిచ్ ఫుడ్స్..ప్రొటీన్...ఆరోగ్యకరమైన కొవ్వు కలిగిన పదార్థాలు తీసుకోవాలి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. ఇవి మీ కడుపును నిండుగా ఉంచుతాయి, చిరుతిళ్లు తినాలనే కోరికను నియంత్రిస్తాయి. ఫైబర్ రిచ్ ఫుడ్స్ మీ బరువును కంట్రోల్‌లో ఉంచుతాయి. పౌల్ట్రీ, చికెన్, కోడి గుడ్లు, చేపలు,చిక్కుళ్లు,వంటి లీన్ ప్రోటీన్ ఆహారాలు తీసుకోవాలి.ప్రోటీన్ ఆకలిని సంతృప్తిపరుస్తుంది. నట్స్, విత్తనాలు, అవకాడోలు, ఆలివ్ నూనె వంటి ఆహార పదార్థాల్లో ఒమేగా – 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు .. ఇవి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతాయి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. కాబట్టి వీటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. వేయించిన ఆహారాలు, ప్రాసెస్ చేసిన చిరుతిళ్లకు దూరంగా ఏండాలిజ ఎందుకంటే వాటిలో సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ ఫ్యాట్స్ అనారోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి.

బ్రేక్ ఫాస్ట్ లో ఒక కప్పు టీ లేదా కాఫీ(చక్కెర లేకుండా), 4 బాదం, 2 వాల్ నట్, ఇడ్లీ, సాంబారు, కొబ్బరి పచ్చడి లేదా దోస , కూరగాయల ఉప్మా భాగం చేసుకోవాలి. ఉదయం కొద్దిగా లేట్ అయిన తర్వాత ఏదైనా ఫ్రూట్ ఆపిల్ లేదా ఇతర ఫ్రూట్స్ (2 ముక్కలు), బొప్పాయి (2 ముక్కలు), జామ పండు(మధ్యస్త సైజు), మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు తీసుకోవాలి. లంచ్ వేళలో దంపుడుబియ్యం, పప్పు లేదా రసం లేదా సాంబారు, పచ్చి ఆకుకూరలు క్యాబేజీ లేదా క్యాలీ ఫ్లవర్ లేదాపాలకూర, కూరగాయల సలాడ్, పెరుగు తప్పనిసరిగా భాగం చేసుకోవాలి.

సాయంకాలం వేళ చక్కెర లేకుండా టీ లేదా కాఫీ,



ఉడకబెట్టిన మిశ్రమ పప్పులు లేదా ఉప్మా లేదా అటుకుల పులిహోర లేదా బిస్కట్ తీసుకోవాలి. పడుకోబోయే ముందు మీగడ తీసిన పాలు తీసుకోవాలి. డిన్నర్‌లో సైతం (లంచ్ మెనూను ఫాలో కావాలి) దంపుడు బియ్యం తీసుకోవాలి.

## ఇందిరమ్మ ఇండ్లు

# నిరుపేదలకు వరం



**వేద న్యూస్, నల్ల గొండ ప్రత్యేక ప్రతినిధి :**

ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ పేరపాక మౌనిక సతీష్ అన్నారు. గురువారం వేములపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులతో కలసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వేములపల్లి మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. పేదల కోసం నిరంతరం కృషి చేసే నాయకుడు మనకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మండల పరిధిలోని ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ తమదైన శైలిలో సహాయ సహకారాలు అందిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రభుత్వం సూచన మేరకు గడువులోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి రామ్ రెడ్డి,గంట నాగయ్య,సబ్బు లింగారెడ్డి, చన్నబోయిన శ్రీను, గడ్డమీది గురుస్వామి, గంట నర్సయ్య, ముత్యాల కృష్ణయ్య, పేరాపాక సైదులు, విష్ణు, ముత్యాల వెంకటయ్య, జంగిలి సైదులు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# మత్తులో యువత జీవితాలు చిత్తు చేసుకోవద్దు

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



మత్తు పదార్థాలకు బానిసగా మారి, నేటి యువత తమ విలువైన జీవితాల్ని చిత్తు చేసుకోవద్దని, డ్రగ్స్ పై కఠినవైఖరి అవలంభించాలని మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. గురువారం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ, మెట్ పల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మనోహర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రకాల మాదక ద్రవ్యాలు విద్యార్థులకు అందుబాటులోకి రావడం దురదృష్టకరం అన్నారు. (మాదకద్రవ్యాల దుర్వినియోగ బాధితులకు చట్టపరమైన సేవలు మాదకద్రవ్యాల ముప్పు నిర్మూలన) 2015 పథకం నేటి యువతని రక్షించడం కోసం ప్రభుత్వం రూపొందించినప్పటికి దాని గూర్చి అవగాహన లేక నేటి విద్యార్థులు, యువత మత్తులో చిత్తవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పోలిసులు కూడా డ్రగ్స్ వాడకం మరియు విక్రయ ప్రాంతాలపై దృష్టి సారించి వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. డ్రగ్స్ ఆకర్షణకు నేటి టీనేజ్ విద్యార్థులు దూరంగా ఉండి, చదువుపై మాత్రమే దృష్టి సారిస్తే భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు. అనంతరం పోలీస్ శాఖ రూపొందించిన వివిధ నినాదాలు గల పోస్టర్లని ఆయన ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమం లో మెట్ పల్లి డియస్పి అట్లూరి రాములు, సీఐ అనిల్ కుమార్, ఎక్షయిజ్ సీఐ వినోద్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్, మండల విద్యా అధికారి మేకల చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి , ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్,అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, బార్ అసోసియేషన్ సభ్యులు మరియు వివిధ పాఠశాలకు చెందిన దాదాపు 1000 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంచితనానికి మారుపేరు

# మిర్యాలగూడ ప్రజలు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ ప్రజలు ఎంతో మంచి మనుషులని,ఎంత ప్రేమిస్తారో అంతే విధంగా ద్వేషిస్తారని,ఇక్కడ ప్రజలు, అధికారులు,పాత్రికేయులు నాకు విధి నిర్వహణలో ఎంతో తోడ్పాటు అందించారని మిర్యాలగూడ మున్సిపలిటీ నుంచి హైదరాబాదుకు బదిలీ అవుతున్న సందర్భంగా కమిషనర్ యూసుఫ్ పత్రిక ముఖంగా తెలిపారు.వారు బదిలీ అవుతున్న సందర్భంగా జనయేత్రి ఫౌండేషన్ తరపు నుంచి మెమొంటో ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మునీర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ ఇక్కడ కమిషనర్ గా పనిచేసిన అనతి కాలంలోనే కమిషనర్ యూసుఫ్ మంచి పేరు తెచ్చుకున్నారని,మిర్యాలగూడ పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచారని,ఆయనను సన్మానించడం మా ఫౌండేషన్ కు గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్,నల్గొండ జిల్లా గౌరవ అధ్యక్షులు అహ్మద్,కార్యనిర్వాహక అధ్యక్షులు కొమరోజ యాదగిరి,ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,జాకీర్ హుస్సేన్,సోహెల్,రఫీ,అమీర్ అలీ,పోగుల సందీప్,కొత్తపల్లి సైదులు,షాహిర్ ప్రవీణ్,హుస్సేన్, శ్రీనివాస్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సైనికుడు 'సుంకరి'

**- హస్తం పార్టీ బలోపేతానికి కృషి - అన్ని వర్గాలతో రమేశ్‌కు విస్తృత సంబంధాలు**

**వేద న్యూస్, జమ్మికుంట:**

కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉంటూ.. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన నిబద్ధ కార్యకర్త సుంకరి రమేష్. ఏండ్లుగా పార్టీలో కొనసాగుతూ.. హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు, వ్యాపారస్తులతో పాటు అన్ని వర్గాల ప్రజానీకంతో విస్తృత సంబంధాలు కలిగిన సుంకరి రమేశ్.. జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీని ప్రజల్లో ఉంచేందుకు విశేష కృషి చేస్తూ.. ముందుకు సాగుతున్నారు. 2000 సంవత్సరం నుంచి హస్తం పార్టీలో కార్యకర్తగా మొదలై.. నాయకుడిగా పార్టీలో ఎదిగి.. పార్టీకి విశేష సేవలు అందిస్తున్నారు. జననేత, దివంగత సీఎం డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు శ్రేణుల్లో మనోధైర్యాన్ని నింపి.. పార్టీని నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన పాదయాత్రలో కీలకంగా వ్యవహరించారు. సహజ వనరులు ఇసుక దోపిడీకి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో కాంగ్రెస్ నాయకుడు రమేశ్ క్రియాశీలకంగా వ్యవహరించారు.

**– శ్రేణులకు రమేశ్ ఆపన్న హస్తం**

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆపన్న హస్తం అందిస్తూ.. సొంత డబ్బులతో కార్యక్రమాలను నిర్వహించడం లోనూ వెనకాడ లేదు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ వొడితల ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యక్రమాలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు. పార్టీలో విభేదాలకు తావు లేకుండా అందరినీ ఏకతాటిపైకి నడిపించేందుకు తన వంతుగా రమేశ్ కృషి చేస్తున్నారు.

**– పార్టీనే ప్రయారిటీ..**

రమేశ్ 2005లో జమ్మికుంట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2009లో అపరభద్రాద్రి ఇల్లందకుంట దేవస్థాన కమిటీ సభ్యుడిగా నియమితులై పని చేశారు. 2010 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు జమ్మికుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా పని చేసి.. ప్రస్తుతం జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలందిస్తున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ ఆశీస్సులు, మార్గదర్శనంలో రమేశ్ పార్టీ కోసం నిత్యం కృషి చేస్తారని, పార్టీ శ్రేయస్సే ప్రాధాన్యతగా ముందుకు సాగుతారని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.



# పట్టాలు ఇచ్చి..ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

**వేద న్యూస్,భూపాలపల్లి :**




భూపాలపల్లి పట్టణంలోని భగత్ సింగ్ కాలనీ గుడిసె వాసులందరికీ పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించుకోవడానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ కుమార్,జిల్లాసమి సభ్యులు వేముల శ్రీకాంత్ లతో కలిసి వెంకట్రాములు భగత్ సింగ్ కాలనీలో నిరు పేదల గుడిసెలను పరిశీలించారు. గుడిసె వాసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇల్లు లేని వ్యవసాయ కూలీలు,అసంఘటిత రంగకార్మికులు,ొంక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులైన నిరుపేదలు భూపాలపల్లిలో ప్రభుత్వ భూమిలో ఎన్నోవ్యయ, ప్రయాసాలకోర్చి గుడిసెలు వేసుకుని గత మూడేళ్లుగా నివాసం ఉంటున్నారని ఎండలకు వానలకు చలికి క్రిమి కీటకాలు అన్నింటిని తట్టుకొని పిల్లాపాపలతో జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. కూలీ నాలి పనులు చేసుకుంటూ జీవించే ఆ పేదల బాధలు వర్ణణాతీతమన్నారు. సరైన రోడ్లు మంచినీటి వసతి స్ట్రీట్ లైట్స్ మొదలైన కనీస వసతులకు సైతం వారు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై గుడిసె వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారని కాలయాపన చేయకుండపట్టాలిచ్చి,ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కలిగించాలని డిమాండ్ చేశారు. గుడిసెవాసులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధంగా ఉండాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.గుడిసె వాసులకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందన్నారు.

# సంపాదకీయం

## ప్రసూతి సెలవు.. మహిళల హక్కు

మే 23, 2025 ఇది భారతీయ స్త్రీల జీవితంలో ఒక చరిత్రాత్మక దినం. ఉద్యోగాలు చేసే మహిళల హక్కులు, ముఖ్యంగా ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీం కోర్టు ఒక అద్భుతమైన తీర్పును వెలువరించింది. కె ఉమాదేవి వెర్సెస్ ది స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో మద్రాస్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రసూతి సెలవు అనేది కేవలం ఒక విధానపరమైన అంశం కాదని, అది ఒక రాజ్యాంగ హక్కు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ఆర్థిక, ప్రసూతి హక్కుల పరిధిని విస్తరింపజేస్తూ, పని ప్రదేశంలో మహిళల పునరుత్పత్తి స్వేచ్ఛకు, గౌరవానికి అగ్రపీఠం వేసింది. ఈ కేసు ఉమాదేవి అనే ఉద్యోగిని చుట్టూ తిరిగింది. ఆమె తన రెండో వివాహం తర్వాత పుట్టిన మూడో బిడ్డకు ప్రసూతి సెలవు కోరారు. తమిళనాడు ప్రభుత్వం ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. అంతకు ముందు మద్రాస్ హైకోర్టు కూడా ఆమె సెలవును నిరాకరించింది. జనాభా నియంత్రణ లక్ష్యాలను ఉటంకిస్తూ మూడో బిడ్డకు ప్రసూతి సెలవును నిరాకరించే తమిళనాడు ప్రభుత్వ విధానాన్ని హైకోర్టు సమర్థించింది. అయితే సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో ఉమాదేవికి పూర్తిగా అనుకూలంగా నిలిచింది. అటువంటి వివక్షాపూరిత వ్యాఖ్యానాలను కొట్టివేసింది. పిల్లల సంఖ్య లేదా వైవాహిక పరిస్థితుల ఆధారంగా ప్రసూతి సెలవును నిరాకరించడం లేదా పరిమితం చేయడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. ప్రసూతి ప్రయోజనాలు ఒక మహిళ పునరుత్పత్తి హక్కులు, ప్రాథమిక గౌరవం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన ఆరోగ్య హక్కు లో అంతర్భాగమని కోర్టు నొక్కిచెప్పింది. అటువంటి వివక్షాపూరిత నిబంధనలు మహిళలపై 'అన్యాయమైన భారాన్ని' సృష్టిస్తాయని, వారి కెరీర్, కుటుంబం మధ్య ఎంపిక చేసుకోవలసి వస్తుందని లేదా వారి పునరుత్పత్తి నిర్ణయాలు తీసుకునే హక్కును అణగదొక్కుతాయని తీర్పు నొక్కి చెప్పింది.

ఈ తీర్పు ప్రసూతి ప్రయోజనాలను కేవలం ఒక సేవా షరతు నుండి ఒక మహిళ పునరుత్పత్తి స్వేచ్ఛ ప్రాథమిక అంశంగా మార్చింది. ఆర్టికల్ 14 (చట్టం ముందు సమానత్వం), ఆర్టికల్ 21 (జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ రక్షణ)లతో అనుసంధానించడం ద్వారా, కోర్టు ప్రసూతి హక్కులకు పటిష్టమైన రాజ్యాంగ ఆధారాలను అందించింది. ఇప్పటి వరకు మన దేశంలో ప్రసూతి హక్కులు ప్రధానంగా ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961 ద్వారా నియంత్రించబడ్డాయి. ఇది 2017లో మరింత సమగ్ర ప్రయోజనాలను అందించడానికి సవరించబడింది. ఈ చట్టం గర్భధారణ సమయంలో, తర్వాత పని చేసే మహిళలకు కొన్ని రక్షణలు, ప్రయోజనాలను అందిస్తుంది. వేతనంతో కూడిన సెలవు, తొలగింపునుండి రక్షణ, ఇతర ప్రసూతి సంబంధిత ప్రయోజనాలను అందిస్తుంది. సెలవు తర్వాత అదే లేదా సమానమైన స్థానానికి తిరిగి రావడానికి హామీ ఇస్తుంది. అయితే ఈ చట్టాలు సాధారణంగా 'రెండు కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న' మహిళలకు ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేశాయి. చాలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సేవల్లో సాధారణంగా ఉన్న ఈ విధానం వివక్షాపూరితమైనదిగా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది. ఈ తీర్పు భారతదేశంలో ఆర్థిక, ప్రసూతి హక్కుల దృశ్యంపై లోతైన, తక్షణ ప్రభావాలను చూపుతుంది. ఇద్దరు పిల్లల నిబంధన లేదా ఇలాంటి ఆంక్షల ద్వారా గతంలో పరిమితం చేయబడిన ప్రభుత్వ ఉద్యోగులపై దీని ప్రభావం ప్రత్యక్షంగా ఉంటుంది. ఈ తీర్పు ఇప్పుడు వారికి పిల్లల సంఖ్యలేదా వైవాహిక సందర్భంతో సంబంధం లేకుండా ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు అనుమతిస్తుంది, వారి జీవితంలో ఒక కీలక సమయంలో కీలక ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఈ నిర్దిష్ట కేసు ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించినది అయినప్పటికీ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన బలమైన రాజ్యాంగ సూత్రాలు ప్రైవేట్ రంగంతో సహా ఇతర రంగాలలో ఇలాంటి వివక్షాపూరిత పద్ధతులను సవాలు చేయడంలో గణనీయంగా ఉపయోగపడతాయి.

పిల్లల సంఖ్య ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్న ఏ సంస్థ అయినా ఇప్పుడు చట్టపరమైన సవాలును ఎదుర్కోవలసి ఉంటుంది. కుటుంబ పరిమాణం ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను నిరాకరించడం తరచుగా మహిళలను, ముఖ్యంగా పునర్వివాహం చేసుకున్న లేదా వివిధ కారణాల వల్ల ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న వారిని అసమానంగా ప్రభావితం చేస్తుంది. అసంఘటిత రంగాలలో పనిచేసే మహిళలకు ఆర్థిక ప్రసూతి హక్కులను విస్తరించడం అనే విస్తృత సమస్య ఇంకా మిగిలి ఉంది. ఈ మహిళలకు తరచుగా వేతనంతో కూడిన ప్రసూతి సెలవు, వైద్య బోనస్, లేదా శిశుసంరక్షణ సౌకర్యాలు వంటి చట్టబద్ధమైన ప్రయోజనాలు అందుబాటులో ఉండవు. గర్భధారణ సమయంలో వారి దుర్బలత్వం తరచుగా వారిని అకాలంగా పనికి తిరిగి వెళ్ళడానికి లేదా మరింత పేదరికంలోకి నెట్టివేస్తుంది. ఈ ప్రగతిశీల తీర్పు స్ఫూర్తిని ఉపయోగించుకొని మరింత సమ్మిళితమైన, సార్వత్రిక సామాజిక భద్రతా చట్టాలను రూపొందించడం తదుపరి కీలక అడుగు. తద్వారా అసంఘటిత రంగానికి కూడా ఆర్థిక ప్రసూతి సహాయాన్ని అందించడం ఈ మే 23, 2025 తీర్పు మహిళల హక్కులను పునరుద్ఘాటిస్తుంది. మాతృత్వం ఉద్యోగానికి అడ్డంకి కాకూడదని లేదా ఆర్థిక ఇబ్బందులకు కారణం కాకూడదని వాదిస్తుంది. ఇది ఆశకు ఒక దీపస్తంభంగా పనిచేస్తుంది. ప్రసూతి ప్రయోజనాల రక్షక గొడుగును విస్తరిస్తుంది. ప్రతి తల్లి ఆమె ఉద్యోగ రంగంతో సంబంధం లేకుండా, గౌరవంగా, ఆర్థిక భద్రతతో మాతృత్వాన్ని స్వీకరించగలదని నిర్ధారిస్తుంది. ఈ తీర్పు రాజ్యాంగపరమైన ప్రేరణను అందిస్తుంది. ఇప్పుడు, సమగ్ర ఆర్థిక ప్రసూతి హక్కులను దేశంలోని ప్రతి మహిళకు వాస్తవంగా మార్చడానికి శాసన, విధానపరమైన విభాగాలు చర్యలు తీసుకోవాలి.

# ఎస్సీఓ భేటీలో భారత్ సంచలనం

- చైనాలో ఎస్సీఓ రక్షణ మంత్రుల భేటీలో కీలక పరిణామం
- ఉగ్రవాదంపై విభేదాలతో ఉమ్మడి ప్రకటనపై భారత్ సంతకానికి నిరాకరణ
- కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని విధానంగా వాడుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ విమర్శ
- పహల్గామ్ దాడిని ప్రస్తావించిన రక్షణ మంత్రి, పాక్‌కు పరోక్ష చురకలు
- చైనా రక్షణ మంత్రితో రాజ్‌నాథ్ ద్వైపాక్షిక చర్చలు, సైనిక హాట్‌లైన్‌పై ప్రస్తావన



**వేద న్యూస్, డెస్క్:**

అంతర్జాతీయ వేదికపై ఉగ్రవాదం విషయంలో తన దృఢ వైఖరిని, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని భారత్ మరోసారి నిష్కర్షగా చాటుకుంది. చైనాలోని కింగ్‌డావో నగరంలో గురువారం జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) రక్షణ మంత్రుల సమావేశంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉగ్రవాద నిర్మూలన, ప్రాంతీయ భద్రత వంటి అంశాలపై రూపొందించిన ఉమ్మడి ప్రకటనలోని కొన్ని ప్రతిపాదనలు భారత ప్రయోజనాలకు, వైఖరికి విరుద్ధంగా ఉండటంతో, దానిపై సంతకం చేయడానికి భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఆ ప్రతిపాదనల పత్రాలను పరిశీలిస్తూ పెన్ను పక్కనపెట్టేశారు. ఈ నిర్ణయం, ఉగ్రవాదంపై, ప్రత్యేకించి సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ ఎంతటి కఠిన వైఖరిని అవలంబిస్తుందో ప్రపంచానికి స్పష్టం చేసింది. సమావేశానంతరం విడుదల చేయాలని భావించిన ఉమ్మడి ప్రకటన ముసాయిదాలో, ఇటీవలే జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో, పాకిస్థాన్ పదేపదే ఆరోపిస్తున్న బలూచిస్థాన్‌లోని మిలిటెంట్ కార్యకలాపాల గురించి పరోక్షంగా ప్రస్తావించే ప్రయత్నాలు జరిగాయని, దీనిని భారత్ తీవ్రంగా వ్యతిరేకించిందని సమాచారం. ఉగ్రవాద అంశంపై సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, చివరికి ఎస్ సీఓ ఎలాంటి ఉమ్మడి ప్రకటనను జారీ చేయకుండానే సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో చైనా, రష్యా, పాకిస్థాన్‌తో పాటు ఎస్సీఓలోని పది సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వ విధానంలో భాగంగా మార్చుకుని, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి శిక్షణనిస్తున్నాయని పరోక్షంగా పాకిస్థాన్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ, ఇది పాకిస్థాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ దుశ్చర్యేనని ఆయన స్పష్టం చేశారు. "ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న శక్తులను ఎస్ సీఓ సమష్టిగా నిలదీయాలి. శాంతి, శ్రేయస్సు అనేవి ఉగ్రవాదంతో కలిసి మనుగడ సాగించలేవు" అని ఆయన ఉద్ఘాటించారు. ఉగ్రవాద చర్యలు ఎక్కడ, ఎవరు, ఏ ఉద్దేశంతో చేసినా అవి నేరపూరితమైనవేనని, వాటిని సమర్థించరాదని ఆయన పిలుపునిచ్చారు.

# బ్లాక్ బాక్సుల డేటా డౌన్‌లోడ్ చేసిన ఏఏఐబీ ల్యాబ్

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**






అహ్మదాబాద్‌లో కూలిన ఎయిర్ ఇండియా విమానానికి చెందిన బ్లాక్ బాక్సుల్లో ఉన్న డేటాను అధ్యయనం చేస్తున్నట్లు ఇవాళ కేంద్ర విమానయాన శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో పత్రికా ప్రకటన జారీ చేసింది. కాక్‌పిట్ వాయిస్ రికార్డ్స్(సీవీఆర్), ఫ్లయిట్ డేటా రికార్డ్స్(ఎఫ్‌డీఆర్) నుంచి సేకరించిన డేటాను విశ్లేషిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ముందు ఉండే బ్లాక్ బాక్సు నుంచి క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్‌ను సురక్షితంగా రిట్రీవ్ చేసినట్లు తెలిపారు. మెమోరీ మాడ్యూల్‌ను విజయవంతంగా తీశామని, దాంట్లో ఉన్న డేటాను ఏఏఐబీ డౌన్‌లోడ్ చేసినట్లు ప్రభుత్వం చెప్పింది. సీవీఆర్, ఎఫ్‌డీఆర్ డేటా ఆధారంగా.. విమాన దుర్ఘటనకు కారణాలను కనుగొననున్నట్లు ప్రభుత్వం ఓ ప్రకనటలో పేర్కొన్నది. విమానయాన భద్రతకు, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోనున్నట్లు సివిల్ యేవియేషన్ శాఖ తెలిపింది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) .. అహ్మదాబాద్ ప్రమాద ఘటనపై దర్యాప్తు చేపడుతున్నది. ఓ ఇంటి పైకప్పు నుంచి సీవీఆర్, ఎఫ్‌డీఆర్ రికవరీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. సీవీఆర్‌ను జూన్ 13వ తేదీన , ఎఫ్‌డీఆర్‌ను జూన్ 16వ తేదీన వెలికితీసినట్లు చెప్పారు. అహ్మదాబాద్‌లో సీవీఆర్, ఎఫ్‌డీఆర్ డేటాకు భద్రత కల్పించామని, పోలీసులు, సీసీటీవీ నిఘాలో ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. పూర్తి భద్రత మధ్య బ్లాక్ బాక్సులను అహ్మదాబాద్ నుంచి ఢిల్లీకి జూన్ 24వ తేదీన తరలించినట్లు తెలిపారు. ఫంట్, రియర్ బ్లాక్ బాక్సులు ప్రస్తుతం ఏఏఐబీ ల్యాబ్‌లో ఉన్నాయి.

# ఉత్తరాఖండ్‌లో ఘోర బస్సు ప్రమాదం

## - బద్రీనాథ్ వెళ్తుండగా నదిలో పడిపోయిన బస్సు

**వేద న్యూస్, డెస్క్:**





ఉత్తరాఖండ్ రుద్రప్రయాగ్‌లోని రిషికేశ్ బద్రీనాథ్ జాతీయ రహదారి సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అలకనంద నదిలో పడిపోయింది. బస్సులో 19 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ సంఘటన పార్గోల్తీర్ సమీపంలో జరిగింది.. అక్కడ ఒక మినీ బస్సు ట్రక్కును ఢీకొట్టింది.. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించాడు. చాలా మంది ప్రయాణికులు నీటిలో గల్లంతయ్యారని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు, పరిపాలన బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. వెంటనే సహాయక చర్యలను ప్రారంభించాయి. రుద్రప్రయాగ్ జిల్లాలోని ఘోలాతిర్ ప్రాంతంలో ఒక బస్సు అదుపు తప్పి అలకనంద నదిలో పడిపోయిందని పోలీసు ప్రధాన కార్యాలయ ప్రతినిధి ఐజి నీలేష్ ఆనంద్ భరానే తెలిపారు. సమాచారం ప్రకారం.. బస్సులో 19 మంది ప్రయాణిస్తున్నట్లు చెబుతున్నారు. వారిలో ఏడుగురిని రక్షించారు. 11 మంది గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారు. ఒకరు మరణించారు. రెస్క్యూ టీం కొంతమందిని రక్షించి చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు. వారిలో చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. కేదార్‌నాథ్ నుండి ప్రయాణించిన తర్వాత, ఈ ప్రయాణికులు రాత్రి రుద్రప్రయాగలో ఉండి గురువారం అంటే ఈరోజు ఉదయం బద్రీనాథ్‌కు బయలుదేరాలని ప్లాన్ చేసుకున్నారని చెబుతున్నారు. కానీ గోచార్ సమీపంలో, బస్సు అకస్మాత్తుగా ట్రక్కును ఢీకొట్టడంతో నదిలో పడిపోయింది.

# రైలు చార్జీలు పెంచొద్దు





**వేద న్యూస్, డెస్క్:**

రైలు టిక్కెట్ ధరలు జూలై నెల ఒకటో తేదీ నుంచి స్వల్పంగా పెంచేందుకు రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందించారు. ఈ మేరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ విషయంపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ రైల్వే అనేది పేద, మధ్యతరగతి ప్రజలకు కేవలం ఒక ప్రయాణ సౌకర్యం మాత్రమేకాకుండా, వారి జీవితాల్లో ఒక అంతర్భాగమన్నారు. ఇదిలావుంటే, తాను చెన్నై నుంచి కాట్పాడికి రైలులో ప్రయాణించగా, కాట్పాడి ప్రజలు స్వాగతం పలకడం ఆనవాయితీ అన్నారు. అయితే, ఈసారి ప్రజల్లో అంత ఉత్సాహం కనిపించలేదన్నారు. దీనికి కారణం వచ్చే నెల నుంచి రైల్వే చార్జీలు పెంచబోతున్నారనే విషయం వారిని తీవ్రగా కలచివేస్తుందనే విషయాన్ని గ్రహించానన్నారు. ఈ పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి ప్రజలపై రైలు చార్జీలను పెంచి ప్రయాణ భారాన్ని మోపొద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు.

# ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ లేఖ

వేద న్యూస్, న్యూఢిల్లీ :

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. కాంగ్రెస్ ఓటర్ల జాబితా, పోలింగ్ రోజు నాటి వీడియో ఫుటేజీని ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశాలకు సంబంధించి లేఖను పంపింది. మహారాష్ట్ర, హర్యానా ఓటర్ల జాబితాల డిజిటల్, మెషిన్-రీడబుల్ కాపీలను వారంలోగా అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ తన లేఖలో స్పష్టంగా పేర్కొంది. అలాగే, పోలింగ్ రోజు వీడియో రికార్డింగ్‌ను ఇవ్వాలని కోరింది. తమ డిమాండ్‌ను పరిష్కరించడం ఎన్నికల సంఘానికి కష్టమైన పనేం కాదని పేర్కొంది. తమ ఈ డిమాండ్ కూడా కొత్తదేం కాదని.. ఈ విషయంలో పార్టీ చాలాకాలంగా డిమాండ్ చేస్తుందని చెప్పారు. రాజకీయ పార్టీల విశ్వాసాన్ని పెంచడమే కాకుండా, ఎన్నికల ప్రక్రియలో ప్రజల విశ్వాసాన్ని నిలుపుకోవాలని కోరింది. అయితే, పార్టీ అగ్రనాయకత్వ బృందం ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధంగా ఉందని కాంగ్రెస్ తెలిపింది. మొత్తం ప్రక్రియపై బహిరంగ చర్చ జరిగేలా విశ్లేషించడంతో పాటు ఆధారాలను కమిషన్ ముందుంచనున్నది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలను బహిర్గతం చేసే డేటా, విశ్లేషణ తమ వద్ద ఉందని పార్టీ పేర్కొంది. మహారాష్ట్ర, హర్యానాలో ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ పనితీరుపై ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నలు లేవనెత్తిన విషయం తెలిసిందే. ముఖ్యంగా మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఓటింగ్‌లో పారదర్శకత లేదంటూ ఆరోపిస్తూ వస్తున్నది.

వేద న్యూస్

శుక్రవారం, జూన్ 27, 2025

## యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

మొదటి పేజీ తరువాయి

చురుకుగా ఉండాలని, హైద్రాబాద్ లో డ్రగ్స్ పై కఠిన చర్యలుతీసుకొంటున్నామని,ఎక్కడికక్కడే కట్టడి చేస్తున్నామని తెలిపారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల కు దూరంగా ఉండాలన్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ మిషన్ పరివర్తన కింద వారం రోజులపాటు మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత ఒక్కసారి డ్రగ్స్ తీసుకుంటే బానిసలు అవుతారని, అందువల్ల తీసుకోవద్దని,డ్రగ్స్ పై చేస్తున్న యుద్ధంలో అందరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ గురించి ఏదైనా సమాచారం అందితే డయల్ 100 కు ఫోన్ చేయాలని ,డ్రగ్స్ వల్ల కుటుంబాలే నాశనం అవుతాయని అన్నారు.నల్గొండ జిల్లా ను డ్రగ్స్ రహిత జిల్లా చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ వాడడం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడవద్దని కోరారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆదనపు ఎస్పీ రమేష్, డి డబ్ల్యుఓ కృష్ణవేణి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి.డి ఈ ఓ భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కార్యక్రమంలో పాల్గొన్న వారితో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు .

## ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల దోపిడీ అరికట్టాలి

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రైవేట్ యాజమాన్యానికి లేదు,వారు ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించుకొని పాఠశాలలు అడ్డా గా చేసుకొని వారు ఫీజుల దోపిడీ చేస్తున్న కూడా ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు కానీ,ప్రజా ప్రతినిధులు కానీ ఎందుకు స్పందించడం లేదు అని ఆయన ప్రశ్నించారు.విద్యాశాఖ నిర్ణయాన్ని గాలికి వదిలేసి వాళ్ళ ఇష్టానుసారంగా పాఠశాలలు నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే మాత్రం పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తానికి సిద్ధమై ఉన్నామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్,నరేష్,సాంబయ్య, ఉపేందర్,రమేష్,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


## రైతు సంక్షేమమే సీఎం సంకల్పం

మొదటి పేజీ తరువాయి

రూపాయల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ అని మాయమాటలు చెప్పి బిఆర్ఎస్ నాయకులు వేలకోట్ల రూపాయల దోచుకున్నారని దుయ్యబట్టారు. కాలేశ్వరం ప్రాజెక్టు లక్షల కోట్లు వ్యయంతో ఖర్చుపెట్టి కడితే మూడు సంవత్సరాలకే కూలిపోయిందని అన్నారు. 18 నెలల పరిపాలనలో రైతుల సంక్షేమం గురించి ఆలోచించిన మహా నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున రైతుల సంక్షేమం గురించి ఆలోచన చేయలేదన్నారు.9 రోజుల్లో 9,000 కోట్ల రూపాయలను రైతుల భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసిందని చారిత్రాత్మక రికార్డ్ అని అన్నారు. రైతుల సంక్షేమం గురించి ఆలోచించే ప్రభుత్వమే కాంగ్రెస్ ప్రభుత్వం మనీ స్పష్టం చేశారు. పేదలకు ఉచిత సన్న బియ్యం దేశంలోనే చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిందని అభిప్రాయపడ్డారు. ఒక్కొక్క వ్యక్తికి 6 కేజీల ఉచిత బియ్యం అందజేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.జగన్ కు మేలు చేసే విధంగా తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి వేలకోట్ల రూపాయలు సంపాదించారని శంషాబాద్ సమీపంలో 90 ఎకరాల గెస్ట్ హౌస్ నిర్మాణం చేసుకున్నారని విమర్శించారు. సంక్షేమం గురించి టిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ ఊర రామమూర్తి, ధారావత్ వెంకన్న, ఫారుక్, జ్యోతి కరుణాకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## నిద్రమత్తులో కంప్యూటర్ ఆపరేటర్లు..!

ఇన్స్పెక్టర్, తహసిల్దారులు పరిశీలించి సంతకాలు చేసినప్పటికీ కంప్యూటర్ ఆపరేటర్ల నిర్లక్ష్యంతో జాప్యం జరుగుతుందని ప్రజలు మండిపడుతున్నారు. జిల్లాలో కొంతమంది కంప్యూటర్ ఆపరేటర్లు విధుల్లో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టిన ముందుగా రేషన్ కార్డ్ ప్రామాణికం కావడంతో జిల్లాలో తహసిల్దార్ కార్యాలయంలో రోజురోజుకు దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పెరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 5 లక్షల 3300 రేషన్ కార్డులు ఉండగా జిల్లాలో ఇంకా కార్డులు పెరగొచ్చని సంబంధించిన అధికారులు అంచనా వేస్తున్నట్లు తెలుస్తుంది . ఇదిలా ఉండగా ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న వేళ నోటిఫికేషన్ వస్తుందనే నేపథ్యంతో ప్రజలు ఆందోళన చెందు తున్నారు. సంక్షేమ పథకాలకు ఆదాయ, కుల ధ్రువీకరణ,రేషన్ కార్డుల తప్పనిసరి అవడంతో తహసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రజలు ప్రదీక్షనులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో దరఖా స్తులను తహసిల్దారులు పరిశీలించినప్పటికీ తొందరగా ఆమోదం లభించడం లేదని ప్రజలు మండిపడు తున్నారు.ఇప్పటికైనా కంప్యూటర్ ఆపరేటర్లు నిద్రమత్తు వదిలి..విధుల్లో అలసత్వం వహించకుండా జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.




మొదటి పేజీ తరువాయి

## కాళీగా భద్రకాళి అమ్మవారు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంబరీ నవరాత్ర మహెూత్సవములు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 4-30నిమిషాలకు నిత్యాహ్నికం పూర్తయిన పిమ్మట అమ్మవారికి ఉత్సవానుజ్ఞ ప్రార్థన జరిపి అమ్మవారి నుండి అనుమతి వచ్చిన మేరకు ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ పూర్వాంగవిధి అర్చకులు నిర్వహించారు. ఉదయం 11:00గంటలకు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ డా.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ఎంతో వైభవంగా ప్రారంభించారు. ఆలయానికి విచ్చేసిన కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డికి ఆలయ ఈ.ఓ శేషుభారతి, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు, ధర్మకర్తల మండలి చైర్మన్ డా. శివ సుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరిరామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగు ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ రావు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అర్చకులు సహస్ర కలశాభిషేక ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా గ్రహమఖం మూలమంత్ర హెూమం, శాంతి హెూమం నిర్వహించిన తదుపరి అమ్మవారికి దాదాపు 2 గంటల సేపు 1008 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అభిషేకం జరుగుతున్నంత సేపు భక్తులు తన్మయత్వంతో ఒక దివ్యానుభూతిని పొందారు. భక్తులంతా సహస్ర కలశాభిషేక అనుభూతిని ఒకరితో మరియొకరు పంచుకున్నారు. అనంతరం





అమ్మవారి షడ్బేరాలలో అమ్మవారి ఎదురుగా ఉన్న బేరాన్ని (మూర్తి) కాళీ మాతగా, మహామండపంలోని బేరాన్ని కామేశ్వరీమాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. రాత్రి 8:30నిమిషాలకు నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాద వితరణతో కార్యక్రమాలు పూర్తయ్యాయి.

## రైతు పక్షపాతి కాంగ్రెస్

**వేద న్యూస్, కాశీబుగ్గ :**



రైతు పక్షపాది కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం ధ్యేయంగా కృషి చేస్తుందని మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ అన్నారు. గురువారం అయన ఎన్టీఆర్ నగర్ లో మీడియాతో మాట్లాడారు. ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు అడుప మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో తొమ్మిది రోజుల్లో 70 లక్షల రైతుల ఖాతాల్లో 9వేల కోట్ల జమ చేసి రైతులకు పంట పెట్టుబడి సహాయం ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. రైతుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ,జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రగ్స్ పై "ఈగల్" నిఘా

సైనికులు అంటేనే పంజాబ్ గుర్తుకువచ్చేదని, అలాంటి పంజాబ్ ఇవాళ డ్రగ్స్ మహమ్మారి వలలో చిక్కుకున్నదని తెలిపారు.

**- ఈగల్ లోగో ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి**

డ్రగ్స్ నిర్మూలన బాధ్యత పౌరులందరిపై ఉందని సీఎం అన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ కనిపిస్తే యాజమాన్యాలు బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. పిల్లల ప్రవర్తనను గమనించేందుకు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించుకోవాలని, విద్యాసంస్థల్లో బిహేవియర్ అబ్జర్వర్స్‌ను నియమించుకోవాలని తెలిపారు. గంజాయి అమ్మేవారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని, గంజాయి పంట, సరఫరా, విక్రయంపై 'ఈగల్' టీమ్ నిఘా పెడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు అనిల్ కుమార్ యాద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, సినీనటులు రామ్ చరణ్, విజయ్ దేవరకొండ, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, హెూం సెక్రెటరీ రవి గుప్తా, తెలంగాణ డీజీపీ జితేందర్, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యాతో పాటు అధికారులు, యువతీ యువకులు పాల్గొన్నారు.




## మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**వేద న్యూస్, వరంగల్ :**



మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని తీర్చిద్దేందుకు కంకణబద్దులు కావాలని నగర మేయర్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ ఎంజీఎం చౌరస్తా నుండి పోచమ్మ మైదాన్ చౌరస్తా వరకు మాదక ద్రవ్య రహిత జిల్లా లక్ష్యంగా నిర్వహించిన అవగాహన ర్యాలీను మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి అంకిత్ కుమార్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగ్య స్వాములు కావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా కఠినమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మాదకద్రవ్యాలను తీసుకోక ముందే వాటిని నివారించాలనే స్లోగన్ తో ముందుకెళుతున్నామని, మత్తు వల్ల కలిగే అనర్థాల గురించి చిన్నతనంలోనే పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు యువత విద్యార్థులు కలసికట్టుగా ముందడుగు వేసి వరంగల్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని అన్నారు. సమాజంపై మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఇతర అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణ, నిబద్ధత పట్టుదలతో జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవచ్చునని అన్నారు. సమాజంలో ఏ ఒక్కరు డ్రగ్స్ కు బానిస కాకుండా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఈ ఉద్యమంలో యువత సైనికుల్లా ముందుకెళ్లాలని, అధికారులు భాగస్వామ్యులై ఉన్నామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిడబ్ల్యుఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్,అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ జన్ను శిభారాణి, ట్రైనీ కలెక్టర్లు జయసింహ, హరిప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జెడ్పి సిఈఓ రామిరెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, అధికారులు, సిడిపిఓలు, పోలీస్ అధికారులు, మెప్మా సిబ్బంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073